## నేడు టీవీ9 లైవ్‌షోకు కేసీఆర్

- బిగ్ డిబేట్‌లో పాల్గొననున్న బీఆర్ఎస్ అధినేత
- సంచలన విషయాలను వెల్లడించనున్నట్టు అంచనా

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి అధినేత కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రముఖ న్యూస్ చానల్ టీవీ9 లైవ్‌షో బిగ్ డిబేట్‌లో పాల్గొననున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే బిగ్ డిబేట్‌ను టీవీ9 ఎండీ, ప్రముఖ న్యూస్ యాంకర్ రజనీకాంత్ నిర్వహించనున్నారు. దాదాపు పుష్కర కాలం తరువాత టీవీ9 లైవ్ షోలో కేసీఆర్ పాల్గొంటున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 24 నుంచి చేపట్టనున్న బస్సు యాత్ర నేపథ్యంలో బిగ్ డిబేట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో కేసీఆర్ సంచలన విషయాలను వెల్లడించే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొద్ది కాలం క్రితమే తాను టీవీ లైవ్ షోలో పాల్గొంటానని, అనేక విషయాలను వెల్లడిస్తానని కేసీఆర్ ప్రకటించారు. టీవీ9 షోపై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# నమ్మకం కోల్పోయిన కాంగ్రెస్

## 10 ఎంపీ స్థానాలు బీఆర్ఎస్‌వే


- సమిష్టిగా కృషి చేస్తే కరీంనగర్ మనదే
- వచ్చే నెల 10వ తేదీన సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కేసీఆర్ రోడ్‌షో
- సిరిసిల్లలో కార్యకర్తలతో కేటీఆర్ వెల్లడి



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణ క్లస్టర్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పాల్గొన్న కార్యకర్తలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): 'అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయింది. ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయడం సాధ్యం కాదని, ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ 8 నుంచి 10 స్థానాల్లో గెలిచే చాన్స్ ఉన్నదని సర్వే సంస్థలు చెప్తున్నాయి' అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. సోమవారం సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో పట్టణ క్లస్టర్ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. సమిష్టిగా కృషి చేస్తే కరీంనగర్ ఎంపీ సీటు మనదే. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్, బీజేపీ చేసిన మోసాలపై చర్చ పెట్టాలి' అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఐదేండ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదని అన్నారు. జిల్లాకు ఒక్క కళాశాల, పాఠశాలనైనా తీసుకొచ్చారా? ఒక్క గుడి కట్టారా? ఒక్క పరిశ్రమనైనా ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. రైతు సమస్యలను కాంగ్రెస్ సర్కారు గాలికి వదిలేసిందని, అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు ఇంతవరకు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, డిసెంబర్ 9న చేస్తానన్న రూ.2 లక్షల రుణమాఫీ నాలుగు నెలలైనా అతీగతి లేదని ధ్వజమెత్తారు. లోకసభ ఎన్నికల్లో మరోసారి రైతులను మోసం చేసేందుకు ఆగస్టు 15 అంటూ సీఎం రేవంత్‌రెడ్డి సరికొత్త డ్రామాకు తెరలేపుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 10న సిరిసిల్లలో పార్టీ అధినేత కేసీఆర్ రోడ్‌షో ఉంటుందని తెలిపారు. ప్రతి కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కష్టకాలంలో తన వెంట నిలిచిన కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకుల గెలుపు కోసం కష్టపడతానని చెప్పారు. కాంగ్రెస్ కేసులకు భయపడవద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లాధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బొల్లి రాంమోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 45.0°c | 36.1°c |
| ఆదిలాబాద్ | 44.5°c | 26.2°c |
| ఖమ్మం | 42.0°c | 25.0°c |
| మెదక్ | 41.9°c | 22.9°c |
| రంగారెడ్డి | 41.6°c | 21.2°c |
| వరంగల్ | 40.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 40.0°c | 27.3°c |
| నిజామాబాద్ | 39.9°c | 26.8°c |
| మహబూబ్‌నగర్ | 39.2°c | 28.4°c |
| కరీంనగర్ | 39.0°c | 27.0°c |

# రేపటి నుంచే కేసీఆర్ బస్సు యాత్ర

### మే పది వరకు 17 రోజులపాటు నిర్వహణ

- మిర్యాలగూడలో తొలి, సిద్దిపేటలో ఆఖరి సభ
- వివిధ నియోజకవర్గాల నుంచి రోడ్‌షోలకు డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే బస్సు యాత్ర బుధవారం ప్రారంభం కానున్నది. వరుసగా 17 రోజులు సాగే ఈ యాత్రకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడంతో పార్టీ అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నది. మే నెల 10 వరకు ఈ బస్సు యాత్ర కొనసాగుతుంది. మిర్యాలగూడలో ప్రారంభమై సిద్దిపేటలో జరిగే బహిరంగసభతో ఈ యాత్ర ముగుస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కేసీఆర్ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. దాదాపు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒకటి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్‌షోలు ఉండే విధంగా బస్సు యాత్రను ప్లాన్ చేశారు. తమ నియోజకవర్గాల్లో కూడా కేసీఆర్ బస్సు యాత్ర చేయాలంటూ వివిధ నియోజకవర్గాల నేతల నుంచి డిమాండ్ వస్తున్నది. అయితే, సమయం తక్కువగా ఉండటం, ఎండ వేడి దృష్ట్యా కొన్ని నియోజకవర్గాల్లోనే బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు.

#### 100 మందికి పైగా వలంటీర్లు

యాత్ర పొడవునా భారీ జన సందోహం రానుండటంతో రోడ్ షోల్లో ఎలాంటి తొక్కిసలాట, గందరగోళం ఏర్పడకుండా వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీరు ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తారు. 100 మందికి పైగా వలంటీర్లు కేసీఆర్ యాత్ర పొడవునా వాహన శ్రేణి వెంట ఉంటారు. ఇప్పటికే ఎంపికైన వారికి సోమవారం తెలంగాణ భవన్‌లో అవగాహన కల్పించారు.

#### తెలంగాణ భవన్ నుంచి వెళ్లనున్న కేసీఆర్

తొలిరోజైన బుధవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందుగా తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. అక్కడున్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేస్తారు. పార్టీ క్యాడర్, నేతలను కలుస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత తొలి రోడ్‌షోలో పాల్గొనేందుకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు బయలుదేరి వెళ్తారని పార్టీ వర్గాల సమాచారం. యాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తుందని, ప్రజలు ఉత్సాహంగా, స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకొస్తారని పార్టీ నేతలు చెప్తున్నారు. దీంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో నిలబడేందుకు, దూరం నుంచి ప్రసంగం వినడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు స్పష్టంగా భారీ స్పందన ఉంటుందని భావిస్తున్నారు.

# రైతుబంధుకే పైసల్లేవ్.. రుణమాఫీకి తెస్తవా?

- ఆగస్టు 15 వరకు సీఎంగా ఉంటవా?
- రెఫరెండం మాట మళ్లీ వినిపిస్తలేదు
- రేవంత్‌రెడ్డి రాజకీయ వ్యభిచారి
- అప్పులపై చర్చకు నువ్వు సిద్ధమా?: మాజీ మంత్రి పొన్నాల సవాల్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): రైతుబంధు పైసలనే ఇప్పటి వరకు పూర్తిగా చెల్లించని సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీకి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తానంటున్న ఆయన అప్పటి వరకు సీఎంగా ఉంటారా? అని అనుమానం వ్యక్తంచేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పొన్నాల మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు తన వంద రోజుల పాలనకు రెఫరెండమని గతంలో చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆ విషయాన్ని ఎక్కడా ఎందుకు ప్రస్తావించడంలేదని ప్రశ్నించారు. అవగాహన రాహిత్యం, పరిపాలన అనుభవం లేని వ్యక్తి రేవంత్ అని విమర్శించారు. ఆయన ఓ రాజకీయ వ్యభిచారి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ మాటలు ఆయన ఫ్రస్టేషన్‌కు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం పదవిని అడ్డంపెట్టుకుని రేవంత్ దౌర్భాగ్యపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రుణమాఫీ అమలు చేస్తామంటూ ఏ జిల్లాకు వెళ్తే అక్కడి దేవతలపై ప్రమాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.7,700 కోట్ల రైతుబంధు ఇవ్వడానికే ఇంత సమయం పడితే వేలకోట్ల రుణమాఫీ చేయడానికి ఎంత సమయం పడుతుందోనని సందేహం వ్యక్తం చేశారు. రూ.18వేల కోట్ల అప్పు తెచ్చి కూడా రైతు బంధు ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పుల గురించి మాట్లాడే రేవంత్‌రెడ్డి, దేశంలో ఏ రాష్ట్రం ఎంత అప్పులు చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాలు విసిరారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి వక్రీకరించి మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పు ఉందని మాత్రమే కేసీఆర్ అన్నారని, గతంలో 104 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ ప్రయత్నించిందని కేసీఆర్ అన్నారని వివరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు 20 మంది ఎమ్మెల్యేలను తీసుకొస్తానంటే తాను వారించానని నాటి సమావేశంలో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. రేవంత్ మాత్రం ప్రతి సభలోనూ కేసీఆర్ తన ప్రభుత్వాన్ని కూలుస్తారని చెప్పినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని, ఆయన వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

### జానారెడ్డి, జైపాల్‌రెడ్డి అంటే చులకనా?

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 30 వేల ఉద్యోగాలిచ్చామని రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని పొన్నాల ధ్వజమెత్తారు. గ్యారెంటీల అమలు గురించి మాట్లాడని సీఎం.. జానారెడ్డి, జైపాల్‌రెడ్డి వంటి అనుభవజ్ఞులను చులకన చేస్తున్నారని మండిపడ్డారు. జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్ అని, అత్యధిక కాలం మంత్రిగా పనిచేసిన అనుభవం జానారెడ్డి సొంతమని పేర్కొన్నారు. ఎండిన పంటలు, పంటనష్టంపై రేవంత్ ఎప్పుడైనా స్పందించారా? అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిజాలు దాస్తున్నదని, రేవంత్ గురించి మాట్లాడాలంటేనే సిగ్గుగా ఉన్నదని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి రోజున 125 అడుగుల ఆయన విగ్రహానికి పూల మాల వేయని సీఎం, వేరేవాళ్లకు కూడా ఆ అవకాశం కల్పించలేదని విమర్శించారు. బీసీలకు న్యాయం చేయని ఆయన జ్యోతిబాపూలే గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉన్నదని పొన్నాల పేర్కొన్నారు.

## రాష్ట్రంలో మరో రెండురోజులు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాగల రెండు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమవారం పలుచోట్ల వర్షాలు కురవగా, మంగళ, బుధవారాల్లో కూడా వర్ష సూచన ఉన్నతని తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. పైజిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉన్నదని తెలిపింది. రాష్ట్రంలో సుమారు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### వడదెబ్బతో ఇద్దరు మృతి

పలిమెల/బిజినపల్లి, ఏప్రిల్22: వడదెబ్బ సోకి సోమవారం రాష్ట్రంలో ఇద్దరు మృతి చెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రానికి చెందిన మహిళా కూలీ కుమ్మరి అనిత (45), నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం సల్కర్‌పేటకు చెందిన రైతు సైదులు (46) వడదెబ్బతో మృతి చెందారు.

### ఉరేసుకొని యువరైతు ఆత్మహత్య

కొత్తూరు, ఏప్రిల్ 22: ఉరేసుకొని ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్ధాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గుండెమోని అంజయ్య చిన్న కొడుకు ప్రవీణ్ ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అంజయ్య ఉదయం తన పొలంలోని పశువుల కొట్టం వద్దకు వెళ్లి చూడగా.. అక్కడే ఉన్న చింతచెట్టుకు ప్రవీణ్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. బోరున విలపిస్తూ.. స్థానికుల సహాయంతో ప్రవీణ్ మృతదేహాన్ని చెట్టుపై నుంచి కిందికి దించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జీ శ్రీనివాస్ తెలిపారు.

### నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు: సీఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం రాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. సోమవారం సచివాలయంలో మున్సిపల్, నీటి పారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై సీఎస్ శాంతికుమారి సమీక్షించారు. నిర్వహణ పనులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని తెలిపారు. సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని సీజీఎంలు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్ నుంచి నీటి పంపింగ్ ఇప్పటికే ప్రారంభమైందని, మే నెలాఖరు వరకు రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి లోటు ఉండదని అధికారులు సీఎస్‌కు తెలిపారు.

### రిజర్వాయర్ల పూడికతీతపై స్టడీ

హైదరాబాద్, ఏప్రిల్22 (నమస్తే తెలంగాణ): రిజర్వాయర్లలో పూడికతీత కోసం సాంకేతిక పరిజ్ఞానం అధ్యయనంపై రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. సింగూరు, కడెం, ఎల్ఎండీ, ఎంఎండీ, నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లో పూడిక సమస్యలున్నాయి. దీంతో ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో సీఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్‌తో కూడిన ఓ ఇంజినీర్ల బృందం రాజస్థాన్‌లోని బిసాలూర్ రిజర్వాయర్‌లో చేపట్టిన పూడికతీత ప్రక్రియను పరిశీలిస్తున్నది.

# ముందుచూపుతోనే మూడో టీఎంసీ!

### తెలిసొస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యం • ఇచ్చంపల్లి లాంటి కుట్రలకు అదే విరుగుడు

- రాజకీయ పబ్బం కోసం 'అవినీతి' అని ముద్రవేసిన బీజేపీ, కాంగ్రెస్
- అనుమతులు ఇవ్వకుండా నేటికీ తొక్కిపెట్టిన కేంద్రంలోని బీజేపీ సర్కారు
- గత ప్రాజెక్టుల అనుభవంతోనే మూడో టీఎంసీకి కేసీఆర్ ప్రభుత్వం డిజైన్



| 1963లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రతిపాదిత నీటి నిల్వ సామర్థ్యం : 112 టీఎంసీలు / 1994లో నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే ప్రకారం నీటి నిల్వ సామర్థ్యం : 90.30 టీఎంసీలు | 2014లో నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే ప్రకారం నీటి నిల్వ సామర్థ్యం: 80.104 టీఎంసీలు | నీటి నిల్వ సామర్థ్యంలో క్షీణత: 31.912 టీఎంసీలు |
|---|---|---|

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): బ్రిజేశ్‌కుమార్ కృష్ణాజలాల కేటాయింపు చేపట్టినప్పుడు, బేసిన్‌తో సంబంధం లేని తెలుగుగంగ ప్రాజెక్టుకు సైతం నీటి కేటాయింపు చేశారు. కారణం, అప్పటికే దాని నిర్మాణం జరిగింది. అందుకే ఆ ప్రాజెక్టుకు రక్షణ (ప్రొటెక్షన్) కల్పించాలనే అంతర్జాతీయ ప్రమాణాల మేరకు కేటాయింపు చేపట్టారు. ఇప్పుడే కాదు, గతంలో బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల్లోనూ ఇదే సూత్రం పాటించారు. బేసిన్‌లో పరివాహక ప్రాంతం, ఎగువ-దిగువ ఇవేవీ పెద్దగా ప్రామాణికంలోకి రాలేదు. ట్రిబ్యునల్ కేటాయింపు సమయంలో అప్పటికే ఉన్న ప్రాజెక్టులు, వినియోగం మేరకు ఆయకట్టుకు రక్షణ కల్పించాలనేదే ప్రధానంగా పరిగణనలోకి తీసుకున్న కనీస సూత్రంగా స్పష్టమవుతుంది.

#### ఇదీ అనుభవం

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో తొలుత రోజుకు రెండు టీఎంసీల చొప్పున గోదావరి జలాలను ఎత్తిపోసుకునేలా డిజైన్ రూపొందించారు. తదనంతర చర్చల్లో భాగంగా మూడో టీఎంసీని సైతం ఎత్తిపోసుకునేలా సివిల్, మెకానికల్ పనులకు ముందుగానే అవకాశం ఉండేలా నిర్మాణ ప్రక్రియ చేపట్టారు. కాళేశ్వరం నుంచి రోజుకు మూడు టీఎంసీల ఎత్తిపోతలు చేపడితే క్రమంగా అది మన హక్కుగా మారుతుందన్న ముందుచూపే ఇందుకు కారణం. కేంద్రం ఏకపక్షంగా నదుల అనుసంధానం పేరిట మన జలాలను తమిళనాడుకు తరలించుకుపోయే కుతంత్రాలు చేస్తే 'మూడో టీఎంసీ' అనేది శ్రీరామరక్షగా నిలుస్తుంది.

#### ఇదీ ముందుచూపు

రాజకీయాలు వేరు. రాష్ట్ర ప్రయోజనాలు వేరు. నదీ జలాల హక్కుల విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలు ఏకమవుతారు. తెలంగాణలో మాత్రం పరిస్థితులు భిన్నం. కాళేశ్వరం ప్రాజెక్టును బదనాం చేయడం తప్ప బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వేరే ఎజెండా లేకుండా పోయింది. చివరకు కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో చేపట్టిన మూడో టీఎంసీ ఎత్తిపోతలపై సైతం అవినీతి బురదజల్లి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు మూడో టీఎంసీని ఎత్తిపోసుకునేందుకు అనుమతులు ఇవ్వకపోగా, ఆ పార్టీ చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ కూడా వంత పాడుతున్నదే కానీ, ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాల కోణంలో ఆ రెండు పార్టీలు ఆలోచించిన దాఖలాలు లేవు. కృష్ణాజలాల పంపిణీలో తెలంగాణకు జరిగిన దశాబ్దాల అన్యాయాన్ని ఆసాంతం గుర్తించినందునే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపు ప్రదర్శించింది. గత అనుభవాల దృష్ట్యా భవిష్యత్తులో జలాల్లో మన హక్కులకు ఎక్కడా భంగం కలగకుండా ఒక టీఎంసీని ఎక్కువగానే జోడించారు. కానీ కాంగ్రెస్, బీజేపీ దానిపై 'అవినీతి' బురదజల్లి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయి. 'లాజిక్‌లు ఎవ్వరూ నమ్మరు. అందరికీ మ్యాజిక్‌లే కావాలి. అందుకే మన దేశంలో శాస్త్రవేత్తల కంటే బాబాలే ఫేమస్..' అంటూ ఒక సినిమాలో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్‌కు తగ్గట్టుగానే బీజేపీ, కాంగ్రెస్ వ్యవహరిస్తున్నాయి. భావి తరాలకు ఉద్దేశించిన అంశాన్ని లాజిక్‌గా ఆలోచించడం లేదు. తెలంగాణకు హక్కుభుక్తంగా వచ్చిన గోదావరి జలాలను సైతం తమిళనాడుకు తన్నుకుపోయేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుతంత్రాలకు 'ముందుచూపుతో చేపట్టిన మూడో టీఎంసీ' వంటివే చెక్ పెడతాయని సాగునీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

#### మూడో టీఎంసీ వెనక అసలు ఉద్దేశం

కమీషన్ల కోసమే ఈ అదనపు టీఎంసీ పనులు అంటూ నిరాధార ఆరోపణలతో రాజకీయ లబ్ధి పొందేందుకు కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి.

### హక్కు జలాలను ఎలా వాడుకుంటాం?

గోదావరి జలాల్లో తెలంగాణకు 954 టీఎంసీల జలాలను వాడుకునే హక్కు ఉన్నది. అధ్యయనం మేరకు బచావత్ ఇది కేటాయించకపోయినప్పటికీ, గోదావరి ట్రిబ్యునల్‌లో పొందుపరిచిన వివరాల మేరకు ఈ వెసులుబాటు ఉన్నది. ఎగువన ఉన్న శ్రీరాంసాగర్, తద్వారా దాని దిగువన ఉన్న ప్రాజెక్టులకు సరైన ఇన్‌ఫ్లోలు ఉండటం లేదు. ఎగువన మహారాష్ట్ర బాబ్లీ ఉచ్చు బిగించింది. 2019లో కాళేశ్వరం అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి శ్రీరాంసాగర్‌కు ఆశాజనకమైన వరదలు ఉన్నప్పటికీ, అంతకు ముందు దశాబ్దాలపాటు శ్రీరాంసాగర్ ఆయకట్టు అరిగోస చరిత్ర మన కండ్ల ముందే ఉన్నది. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లోగానీ, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డాక్యుమెంట్లల్లోగానీ ప్రధాన గోదావరిలో వరద లేనందునే ప్రాణహిత జలాలను వినియోగించుకుంటామని స్పష్టంగా ఉన్నది. ఈ క్రమంలో ప్రాణహిత కలిసిన తర్వాత తెలంగాణ గోదావరి జలాల వినియోగానికి కాళేశ్వరం, సమ్మక్క బరాజ్ ద్వారా దేవాదుల, అటు పిమ్మట దిగువన ఉన్న సీతారామ వంటి పిడికెడు ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. అందుకే తక్కువ రోజుల్లో ఎక్కువ జలాలను తరలించుకోవాలనే తాపత్రయంతోనే మూడో టీఎంసీని చేపట్టారు.

వాస్తవానికి కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో తొలుత గోదావరిలో వరద రోజులు (ఫ్లడ్ డేస్) 120 రోజులుగా నిర్ధారించారు. ఆ మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో భాగంగా గోదావరి నుంచి తరలించాల్సిన 195 టీఎంసీలను లిఫ్టు చేసుకుంటామని పేర్కొన్నారు. కానీ మరింత లోతుగా అధ్యయనం చేయడం, ముమ్మందు ఇతర రాష్ట్రాలు, వరద పరిమాణంలో చోటుచేసుకునే మార్పులను దృష్టిలో ఉంచుకొని వరద రోజులను 80 రోజులకే పరిమితం చేశారు. గోదావరిలో మంచి ఇన్‌ఫ్లోలు 80 రోజుల్లోనే ఉంటున్నందున ఆ సమయంలోనే 195 టీఎంసీలను ఎత్తిపోసుకునేందుకు సామర్థ్యాన్ని రోజుకు రెండు టీఎంసీల నుంచి మూడు టీఎంసీలకు పెంచుకోవాలని నిర్ణయించారు. తద్వారానే తెలంగాణకు గోదావరి జలాల్లో హక్కుభుక్తంగా వచ్చిన 954 టీఎంసీలను త్వరితగతిన, సంపూర్ణంగా వాడుకునేందుకు వెసులుబాటు లభిస్తుందని ఆశించారు.

#### ఇవీ చేదు అనుభవాలు

గోదావరిపై నిర్మించిన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల విషయంలోనూ కాలానుగుణంగా వచ్చిన మార్పులతో ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న అనుభవాలు కూడా మన కండ్ల ముందే ఉన్నాయి. అవి, గోదావరి ఉప నది మంజీరాపై ప్రపంచంలోనే తొలి భారీ సాగునీటి ప్రాజెక్టుగా చరిత్రకెక్కిన నిజాంసాగర్ డిజైన్ ప్రకారం 2,31,338 ఎకరాలకు సాగునీరు అందించాలి. కానీ, అది నిర్దేశిత ఆయకట్టులో 25% ఆయకట్టుకు సైతం సాగునీరు అందించలేకపోతున్నది. కారణం, ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర మంజీరాను బంధించాయి. కర్ణాటక ఒక్క బీదర్ జిల్లా పరిధిలోనే మంజీరాపై 13 బరాజ్‌లు నిర్మించింది. దీనికి తోడు 1931-1972 వరకు ప్రాజెక్టులో పదింతల మేర పూడిక పెరిగిపోయి, నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. గోదావరిపై కాంగ్రెస్ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1963లో శంకుస్థాపన చేస్తే, 1984లో క్రస్టు గేట్లను ఏర్పాటుచేశారు. 1994లో ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబరేటరీస్ (ఏపీఈఆర్ఎల్) హైడ్రోగ్రాఫిక్ సర్వే చేయగా, నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 90.30 టీఎంసీలకు పడిపోయినట్టు తేలింది. 2013 డిసెంబర్-2014 జనవరిల్లో అధునాతనమైన ఇంటిగ్రేటెడ్ బోట్ మౌంటెడ్ బాతిమెట్రిక్ సర్వే (ఐబీఎస్) విధానంతో హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహిస్తే, నీటి నిల్వ సామర్థ్యం 80.104 టీఎంసీలకు పడిపోయినట్టుగా గుర్తించారు. అంటే ప్రాజెక్టు వాస్తవ నీటి నిల్వ సామర్థ్యం కంటే 31.912 టీఎంసీలు (28.48%) తగ్గింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహారాష్ట్రతో చేసుకున్న లోపభూయిష్టమైన ఒప్పందాన్ని ఆసరాగా చేసుకొని మహారాష్ట్ర ఎస్సారెస్పీ ఎఫ్ఆర్ఎల్ పరిధిలోనే బాబ్లీ ప్రాజెక్టును కట్టింది.

### అనుమతులు ఇవ్వకుండా రాజకీయ డ్రామాలు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి తొలుత అన్ని రకాల అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆపై మూడో టీఎంసీకి వచ్చే సరికి మెలిక పెట్టడం ప్రారంభించింది. ముఖ్యంగా బీజేపీ ఎంపీ బండి సంజయ్ కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలు మొదలుపెట్టి, మూడో టీఎంసీపై కేంద్ర జల సంఘానికి లేఖ రాశారు. దీంతో అప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రశంసల వర్షం కురిపించిన కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు, కేంద్ర జల సంఘం చైర్మన్, ఇతర సభ్యులు, ఇంజినీర్లు చివరకు మూడో టీఎంసీని ఎత్తిపోసుకునేందుకు అనుమతి ఇవ్వకుండా కొర్రీలు పెట్టడం ప్రారంభించారు. కేవలం కాంట్రాక్టులు, పనుల కోసమే అదనపు జలాల తరలింపు అనే అర్థరహిత, వితండ వాదనను బీజేపీ భుజాన వేసుకున్నది. మూడో టీఎంసీ కోసం సీడబ్ల్యూసీకి పంపిన డాక్యుమెంట్లలో కాళేశ్వరం ప్రాజెక్టులో తొలుత నిర్దేశించిన 190 టీఎంసీల కంటే ఒక్క చుక్క కూడా అదనపు నీటిని ఎత్తిపోసుకుంటామని ఎక్కడా పేర్కొనలేదు. ఆ 195 టీఎంసీల నీటినే మంచి వరద ఉన్న రోజుల్లో త్వరితగతిన ఎత్తిపోసుకుంటామని స్పష్టంగా పేర్కొన్నది. కానీ కేసీఆర్ ప్రభుత్వాన్ని, బీఆర్ఎస్‌ను బదనాం చేయాలనే ఏకైక ఎజెండాతో ప్రధాని మోదీ మొదలు బీజేపీ నాయకులు మూడో టీఎంసీపై ఆరోపణలు చేశారు. దానికి కాంగ్రెస్ నేతలు వంత పాడారు.

### 'ఇచ్చంపల్లి' కుట్రలకూ ఇదే అస్త్రం

మన హక్కు.. మన నీళ్లు అనుకుంటాం. కానీ ఎగువ, పొరుగు రాష్ట్రాలు కాలానుగుణంగా చేపట్టే ప్రాజెక్టులు, పెంచుకునే జలాల వినియోగంతో చివరకు హక్కుభుక్తంగా వచ్చే జలాలకూ ఎసరు పడుతుంది. ఇందుకు కృష్ణా జలాల్లో తెలంగాణ ఎదుర్కొంటున్న విచిత్రమైన పరిస్థితే నిదర్శనం. దీనితో పాటు మహారాష్ట్ర తరఫున బల్లెంగా మారిన బాబ్లీ, ఆంధ్రప్రదేశ్ నుంచి పిడుగుపాటులాంటి పోతిరెడ్డిపాడు.. వంటివి కూడా మన హక్కుగా ఉన్న జలాలకు గండికొడతాయి. తాజాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనకు దక్కాల్సిన గోదావరి జలాలను రాజకీయ లబ్ధి కోసం తమిళనాడుకు తన్నుకుపోయేందుకు ప్రతిపాదించిన 'ఇచ్చంపల్లి' నదుల అనుసంధాన ప్రాజెక్టుల వంటివి కూడా మన ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయి. ఇలాంటి సమయాల్లో మూడో టీఎంసీ వంటివి మనకు శ్రీరామరక్షగా ఉంటాయి. కాళేశ్వరం పథకంలో రోజుకు మూడు టీఎంసీల చొప్పున గోదావరి జలాల ఎత్తిపోతకు అన్ని హంగులు ఉన్నట్టయితే ట్రిబ్యునల్స్‌గానీ, న్యాయస్థానాలుగానీ అప్పటికే అందుబాటులో ఉన్నాయనే ఒకే ఒక్క కారణంతో రక్షణ కల్పిస్తాయి. బచావత్ కేటాయింపుల్లోనూ కృష్ణా బేసిన్‌తో సంబంధంలేని పెన్నా బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేవలం ఈ ఒక్క కారణంగానే (మనుగడలో ఉన్న ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు రక్షణ కల్పించాలి) ఎక్కువ కేటాయింపులు చేసింది. కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఈ మూడో టీఎంసీ కూడా ముమ్మందు తెలంగాణకు గోదావరి జలాల వినియోగంలో శ్రీరామరక్షగా ఉంటుంది. ఈ లాజిక్‌ను అర్థం చేసుకోలేకనో, అర్థమైనా తెలంగాణ ప్రయోజనాలు పట్టకనో.. దురదృష్టవశాత్తు తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కూడా తమ పార్టీ జాతీయ నాయకుల రాజకీయ ప్రయోజనాలు తీర్చేందుకు పావులుగా మారి సొంత గడ్డ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తుండటమే విషాదం.